


కాలేజీ నుండి ఇంటికి రాగానే పుస్తకాలు టేబుల్ పై విసిరికొట్టి సోఫాలో అలసటగా కూర్చుంది కల్పన.

"మమ్మీ, నేను క్లాస్ ఫస్ట్ వచ్చాను మమ్మీ" అంటూ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపించాడు కల్పన ఒక్కగానొక్క కొడుకు అమర్.

"అబ్బ ఉండరా, అలసిపోయి వస్తే వెధవగోల" అన్న తల్లిని చూచి మొహం చిన్నబుచ్చుకుని, ఆడుకోవటానికి బయటకెళ్ళిపోయాడు అమర్.

కళ్ళు తెరచి ఎదురుగా టీపాయ్ మీదవున్న ఆ రోజు పోస్ట్ చూచింది కల్పన.

అందులో ఓ కవర్ తన దృష్టిని ఆకర్షించింది. ఉత్సుకతతో ఆ కవర్‌పై 'ఫ్రం' అడ్రస్ చూసింది. ఆ కవర్ అత్తగారి నుంచి అని తెలుసుకున్న కల్పన నిరాసక్తంగా ఓపెన్ చేసి చూసింది. అందులో చి.సౌ. కల్పనకు,

శుభాశీస్సులు.

అచ్చట నీవు, రమణబాబు, అమర్‌లు కులాసాగా వున్నారని తలుస్తాను. నాకీమధ్య ఒంట్లో బావుండటం లేదు.

అంతవరకు ఉత్తరం చదివిన కల్పనకు చిరాకేసి, ఉత్తరం విసిరి టీపాయ్‌పై పడేసి ఒక్కసారిగా గతంలోకి వెళ్ళిపోయింది. అత్తగారు శారద చనిపోయిన నెల కొచ్చిందా ఉత్తరం. ఆవిడ బ్రతికున్నన్నాళ్ళు తనకేవిధంగా సాయపడింది కనుక! చచ్చి కూడా సాధిస్తున్నది.

అమర్ తన కడుపులో రూపుదిద్దుకుంటున్నపుడు, ఒక వైపు వేవిళ్ళతో నీరసంగా వుండి కాలేజీ పని, ఇంటిపని చేసుకోలేక సాయంగా వుండటానికి రమ్మని ఆయన రాస్తే.

ఆవిడ తనని జాలి తలచిందా?

# అత్త లేని కోడలు

## - చివుకుల రామేశ్వర్

"దొంగల భయం ఎక్కువగా వుంది, ఇల్లు వదలి రావటం కష్టం, ఎవరయినా వంట మనిషిని పెట్టుకో" అని ఓ ఉచిత సలహా పారేసింది. తన పుట్టింటి నుంచి ఏ సాయమూ రాలేదు. వారు సాయం చేయలేక పోవటానికీ కారణం వున్నది. ఎందుకంటే తల్లిదండ్రులు లేని తనను అన్నయ్య చదివించి పెళ్ళి చేశాడు. పిల్లలతో సతమతమయే వదిన తను రాలేనని వ్రాసింది. అప్పటికీ పురుడు మాత్రం పోసి పంపింది. "మెటర్నిటీ లీవు" మూడు నెలలు అవగానే ఆయనగారు నాకు హోటల్ తిండి పడటము లేదని హడావుడిగా పసివాడితో సహా తీసుకు వచ్చారు. అమర్ పసివాడుగా వున్నప్పుడు పడ్డ పాట్లు తను జీవితంలో మరచిపోలేదు. తను పనిచేసే కాలేజీ స్టాఫ్ రూమ్‌లో పసివాడిని పెట్టుకుని అబ్బ ఎన్ని అవస్థలు పడ్డానో!

అప్పటికీ వెధవ ఉద్యోగం మానేద్దామా అని కూడా ఆలోచించింది తను. కాని, ఒకరి సంపాదనతో సంసారం గడిపే రోజులా ఇవి? వేణ్ణీళ్ళకు చన్నీళ్ళలా ఇద్దరం సంపాదించబట్టే ఈ రోజున తాము ఓ ఇల్లు ఏర్పరుచుకోగలిగాం. ఇంట్లో లేని వస్తువంటూ లేదు. ఫ్రిజ్, కూలర్, కలర్ టీవీ, వాషింగ్ మిషన్ ఒకటేమిటి అన్నీ ఏర్పరచ గలిగాం.

ఆవిడ ఇక్కడికి వచ్చినా నాల్రోజులుండి కొంపలంటుకుపోయేలా వెళ్ళిపోయేది నాకు తోచటం లేదంటూ.

నిజానికి తన దగ్గర నిక్షేపంలా ఉండచ్చు తను. కాని ఆ అనుభవం లేకుండానే వెళ్ళిపోయింది ఆవిడ. కర్మకాండలకు అక్కడకు వెళ్ళినపుడు తెలిసింది ఆవిడ హఠాత్తుగా తిరుగుతూనే చనిపోయిందని, ఎవరిచేత చాకిరి చేయించుకోకుండా.


అనుకుంటూ కల్పన డ్రెస్సింగ్ టేబుల్ దగ్గరకొచ్చి అద్దంలో మొహం చూసుకుని ఉలిక్కిపడింది.

అరే ఎంత మారిపోయింది తను. కళ్ళ క్రింద చర్మం నల్లని కప్పు వేసింది. పాపిటలో అక్కడక్కడ మెరుస్తున్న తెల్లని వెంట్రుకలతో రెండు పక్కలా తల నెరిసిపోయి తను కూడా వార్థక్యంలో పడుతున్నట్టు హెచ్చరించినట్లయింది.

ఏమిటిదీ, తనకు ముప్పయ్యయిదేళ్ళకే ముసలితనం వచ్చేసిందీ?

ఒక్కసారిగా కల్పనను నిస్పృత్తువ ఆవరించింది. మనసంతా ఓ విధమయిన డిప్రెషన్‌కు గురి అయింది.

దీనికంతకూ కారణం తన అత్తకదూ! తన దగ్గర వుంటూ తనకు సాయంగా వున్నట్లయితే తను స్ట్రెయిన్ అయ్యేది కాదు. కాలేజీలో గొంతు పోయేట్టుగా హిస్టరీ పాఠాలు అరచి అరచి ఇంటికి రాగానే ఎదురుచూసే ఇంటి పని.



రాత్రి ఏ పదో పదకొండో అయేది శ్రీవారి సేవ అనంతరం పడుకోగానే.

ఆడదాని బ్రతుకింతేనా

ఆడదానికి ఆడే సహకరించదు.

కల్పనకు రమణపైనా, అత్తగారిపైనా విపరీతమయిన కోపం వచ్చింది.

ఒక్కసారిగా తన జీవితంపైన విరక్తి పుట్టింది.

ఎంతందంగా వుండేది తను.

కాలేజీలో 'కల్పన కాలేజి బ్యూటీ' అని ముద్దుగా పిలిచేవారు.

ఓ "పబ్లిక్ సెక్టారు" కంపెనీలో ఇంజనీరయిన ఈ రమణ చేతిలో చిక్కింది తను. ఆయన తనను ఎంతో చక్కగా అర్థం చేసుకోబట్టే తను బతగ్గలుగుతూంది. అప్పటికీ ఆయనకు వీలయినప్పడల్లా ఇంటి పనుల్లో సాయం చేస్తాడు కూడా. అటువంటి రమణకు తనను చూసి "ఇస్తారా"

అని అన్నయ్య నడగటంతో ఎగిరి గంతేసిన అన్నయ్య వెంటనే పెళ్ళి జరిపించాడు.

"ఏమిటోయ్, అలా కూర్చుని నిద్ర పోతున్నావ్?" అంటూ లోపలకొచ్చిన రమణ మాటలకు ఉలిక్కిపడి తన ఊహాలోకం నుండి భూలోకంలోకి వచ్చింది కల్పన.

"ఆ! ఏమీ లేదు, కాస్త నీరసంగా వుంటేను, ఎం‌: సేపయింది మీరొచ్చి" అన్నది

"ఇప్పడే. కాస్త కాఫీ ఇస్తావటోయ్" అంటూ డ్రస్ మార్చుకుని బాత్ రూమ్‌కి వెళ్ళిపోయాడు రమణ.

"అరె, ఏమిటివాళ! ఏమయింది తనకు?" అనుకుంటూ కల్పన కాఫీ చేసి తెచ్చి టీపాయ్‌పై పెట్టబోతూ అసంపూర్ణంగా చదివిన ఉత్తరంలో అత్తగారు. ఇంకా ఏమి వ్రాసిందో అని కుతూహలంతో చదవసాగింది. అందులో...

"సరే నా ఆరోగ్యం గూర్చి వ్రాసి మిమ్మల్ని బాధపెడుతున్నా కదు కల్పనా! నా మీద నీకు చాలా కోపంగా వుండి వుంటుంది. ఎందుకంటే మీరు అక్కడికి వచ్చి వుండమని అని అడిగినప్పడల్లా నేను తిరస్కరించడం జరిగింది. దానికి కారణం వ్రాస్తున్నా చదువు. ఈ విషయం నీకు ఎందుకు వ్రాస్తున్నానంటే నేను నిన్ను పరాయి దానిలా ఎన్నడూ చూడలేదు కాబట్టి. నా హృదయంలో బాధ నీకు చెప్పకోక ఎవరితో చెప్పకోను? ఆడపిల్లలు వున్నాకాని వాళ్ళు వివాహం అయినంత వరకే. ఆ తరువాత 'ఆడ' వారే కదమ్మా, అందుకని నీకు నా హృదయం విప్పి ఈ ఉత్తరంలో పరుస్తున్నా...నాకు చిన్నతనంలోనే వివాహం అయింది. నేనప్పడు పన్నెండేళ్ళ పిల్లను. ఆయనకు పదహారేళ్ళు. ప్రపంచం తెలియని వయసులో మా అత్తగారింట్లో కాలు పెట్టాను.

ఆయన అవిటివాడని పెళ్ళి కాదని, బీదింటి పిల్లనయిన నన్ను కానీ కట్నం అడుగకుండా చేసుకున్నారు. ఆయన అవిటివాడయినా మనసు అవిటి కాదు. చాలా మంచి మనసు కలవాడు. నలుగురన్నదమ్ముల్తో వారిది ఉమ్మడి కుటుంబం. ఆయన రెండో వారు. అవిటివాడయినందువల్ల ఆయన్నందరూ చులకనగా చూసేవారు. ఆఖరికి ఆస్తి పంపకాల వద్ద కూడా ఆయనకు అన్యాయమే జరిగింది. ఆయన భాగంగా అప్పలు వసూలు చేసుకోమని అప్పచెప్పి పనికిరాని పాత్ర సామాను, ఇప్పడు నేనుండే ఇల్లు ఆయనకిచ్చారు. ఇంక నా సంగతంటావా...అవిటివాడి పెళ్ళాం అందరికీ లోకువ అన్నట్లు ఇంటెడు చాకిరి నాపై వేసేవారు నా తోడికోడళ్ళు. ఒక వైపు వేవిళ్ళతో, ఇంటి చాకిరితో సతమతమయేదాన్ని నేను. రమణ కడుపులో పడ్డాడపుడు.

ఆయన ఎప్పడూ తన పిత్రార్జితపు ఆస్తి కాశపడకుండా స్వశక్తితో బతకాలనే పట్టుదలతో టీచర్ ట్రయినింగ్ చదివి బడిపంతులుగా పనిచేసేవారు.

ఆయన ఎప్పడూ నాతో అంటూ వుండేవారు "శారదా అవిటివాడితో ఎంత కష్టపడుతున్నావే" అని. "శారదా నీవు మాత్రం నన్ను వదిలి వెళ్ళకే" అని జాలిగా అడిగేవారు. రమణ తరువాత మీ వదినలు పుట్టడం, కొద్ది కాలానికే ఆయన పోవటం జరిగింది. ఇద్దరు ఆడపిల్లలు, ఒక మొగపిల్లవాడితో నా

సంసారం లాగటం కష్టమయింది. పాత్ర సామాను అమ్మగా వచ్చిన డబ్బుతో ఓ కుట్టు మిషను కొనుక్కుని దానిపై సంపాదించటం మొదలెట్టాను. అదృష్ట వశాత్తు శారదమ్మ కుట్టిన బట్టలు బావుంటాయని పేరు రావటం దానిపై వచ్చిన ఆదాయంతో ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేసి పంపి పిల్లవాడిని చదివించ గలిగాను. ఆశ్చర్యపోతున్నావా? నా స్వేచ్ఛా జీవితం అప్పుడే మొదలయింది. నా కాళ్ళపై నేను నిలబడగలిగాను. ఈ విషయాలు నీకు చెప్పకూడదని రమణ చేతిలో చేయి వేయించుకున్నాను. అందుచేత వాడు నీకు చెప్పి వుండకపోవచ్చు.

చిన్ననాటి నుండి చాకిరితో గడిపిన నా జీవితం నా స్వశక్తివలన ఇప్పటి వరకు సాఫీగా జరిగి చాలా వరకు స్వేచ్ఛా జీవితానికి అలవాటుపడి, నీవు అక్కడికి వచ్చి సాయంగా వుండమని అడిగినా, నా స్వేచ్ఛకు ఎక్కడ భంగం వాటిల్లుతుందో అనే స్వార్థం నీవెన్నిసార్లు బ్రతిమిలాడినా రాకుండా చేసింది.

కాని వృద్ధాప్యంలో మొగ అయినా ఆడ అయినా ఓ 'ఆలంబన'

ఒక 'అండ' కోరుకుంటుందని ఇప్పుడు తెలుసుకున్నానమ్మా. నన్ను క్షమి స్తావు కదూ!

కల్పనా, నేను జీవితంలో చాలా అలసిపోయానమ్మా. నాకు విశ్రాంతి కావాలి. అందుకే ఓ నిర్ణయానికి వచ్చాను. నాకు కూతురయినా నీవే కోడల యినా నీవే! ఇక నీ చల్లని ఒడిలో విశ్రాంతిగా కాలం వెళ్ళబుచ్చుతాను. నీకు సాయానికి కాదమ్మా నే వచ్చేది.

నీ సాయం కోరుతూ నేనే అక్కడికి వస్తున్నా. ఇక మిగిలిన విషయాలు అక్కడికి వచ్చినపుడు నీతో మాట్లాడుతా.

అమర్‌కు నా ముద్దులు చెప్పి

రమణబాబును మీ క్షేమ సమాచారాలతో ఉత్తరం వ్రాయమను.

నీ ఆరోగ్యం జాగ్రత్త.

ఇట్లు
శారద

కల్పన కళ్ళు జలపాతాలయ్యాయి.

"ఏమిటోయ్ ఏడుస్తున్నావ్" అంటూ కంగారుగా రమణ అడుగుతూ, కల్పన చేతిలో ఉత్తరం తీసుకుని చదివి-

"ఓస్ ఇంత మాత్రానికేనా" అన్నాడు.

"మీకంత మాత్రంగానే వుంటుంది అంతా తెలుసు కాబట్టి" అన్నది దుఃఖాన్ని దిగమింగుకుంటూ కల్పన.

"అది కాదోయ్" అంటూ దగ్గరకు తీసుకోబోయాడు రమణ.

"ఫోండి నా దగ్గరకు రాకండి, మీ మీద కోపంగా వుంది నాకు" అన్నది కల్పన అతన్ని దూరంగా నెట్టివేస్తూ.

"కల్పనా నీకో శుభవార్త చెప్పనా! అమ్మ! అమర్ పేరున రికరింగ్ డిపాజిట్ కట్టిందిట. అది మెచ్యూర్ అయింది. దానికి నామినీగా నిన్ను వేసింది. అది తీసుకోమని బాంకువారు ఈరోజే ఇంటిమేట్ చేశారోయ్. అంతే కాదు. అదే బాంకు లాకర్లలో దాచిన ఆమె గొలుసు అవి నీకు చెందాలని కూడా వ్రాసిందోయ్ ఆమె"

కల్పన పశ్చాత్తాపంతో కృంగిపోతూ "ఏవండీ ఆవిడ డబ్బుకు ఎప్పుడయినా ఆశపడ్డానండీ నేను. నే కోరుకుంది వేరు. అది కూడా నా స్వార్థంతో...సరే ఆవిడ డబ్బు మనకెందుకండీ, మనకేం లోటుందని! ఆవిడిచ్చిన దానిని ఏదయినా ఓ మంచి పనికి వినియోగిద్దామండీ-అది కూడా ఆవిడ స్మారకార్థం మాత్రమే" అన్నది.

"చిత్తం దేవీ" అన్నాడు కల్పనలో వచ్చిన మార్పుకి సంతోషిస్తూ. ●